క్లుప్తంగా

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి: పట్టణంలోని పీవీరోడ్డులో వెలసిన అంకాళమ్మ ఆలయం వద్ద గురువారం అమావాస్యను పురస్కరించుకుని నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండేళ్లుగా ప్రతి అమావాస్యకు భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోవర్ధన్‌రావు, యశ్వంత్‌రావు, ఉమేష్‌రావు, క్రాంతికుమార్, డాక్టర్ కృపానిధి, ఉపేంద్ర రెడ్డి, రాఘవేంద్ర, సావిత్రిబాయి, మాధవ, సాయి, సుశీల, బాబు, వినీత్‌రెడ్డి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం

ఏర్పేడు: మండలంలోని గురువారం సాయంత్రం కురిసిన ఒక మోస్తరు వర్షానికి ప్రజలు ఉపశమనం పొందారు. భానుడి ప్రతాపానికి ఎండతీవ్రత అధికం కావడంతో చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడ్డారు. ఎండతో వ్యవసాయ, ఉపాధిహామీ కూలీలు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు పనులు చేపట్టలేక ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఈ వర్షంతో కొంతమేర వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

జార్ఖండ్ గవర్నర్‌కు సన్మానం


రాధాకృష్ణన్‌ను సన్మానిస్తున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి: జార్ఖండ్ గవర్నర్, పాండిచ్చేరి, తెలంగాణ రాష్ట్రాల ఇన్‌చార్జ్ గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్‌ను గురువారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మంగళవారం ఢిల్లీలోని ఆయన నివాస గృహంలో కలిశారు. ఆయనను తిరుమల శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎమ్మార్సీకి చేరిన విద్యాకానుక


సత్యవేడుకు చేరిన విద్యాకానుకలను పరిశీలిస్తున్న ఎంఈఓ

సత్యవేడు: 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యాకానుక కిట్లు మండల కేంద్రంలోని ఎమ్మార్సీకి చేరినట్లు ఎంఈఓలు కే.రవి, ఉషా తెలిపారు. విద్యాకానుకలో భాగంగా నోటు పుస్తకాలు 27,650, బెల్టులు 2,964, యూనిఫామ్ 4,339, పాక్షికంగా పాఠ్యపుస్తకాలు 4,067 చేరినట్లు ఎంఈఓ తెలిపారు. జిల్లా అధికారులు ఆదేశాల మేరకు 65 పాఠశాలల్లోని 4,339 మంది విద్యార్థులకు విద్యానుక కిట్ల పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు.

అనీమియా వ్యాధిపై అవగాహన


అనీమియా వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు పంచాయతీ ఆదిలక్ష్మయ్య గిరిజన కాలనీలో గురువారం వైద్యాధికారి దివాకర్, సీహెచ్‌ఓ వేంకటేశ్వర్లు సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా జీవిత కాల వ్యాధి అని, రక్తంలో ఎర్ర రక్త కణాలలో వృత్తాకార బిళ్లల రూపంలో ఉంటాయన్నారు. ఈ వ్యాధితో రక్త ప్రసరం తగ్గుతుందని, దీంతో స్ట్రోక్, కంటి సమస్యలు, ఆర్గానిక్స్ దెబ్బతింటాయని తెలిపారు. గిరిజన కాలనీలో ఈ వ్యాధి అధికంగా ఉండడంతో వారికి పరీక్షలు చేసి, వ్యాధి ఉన్న వారిని గుర్తిస్తామని చెప్పారు.

మాజీ సర్పంచ్ మృతి


ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం సభ్యులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు మాజీ సర్పంచ్, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా డైరెక్టర్ రమణయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ ప్రకాష్, జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రజని, జిల్లా డైరెక్టర్లు అంబాకం చిన్నరాజ్, వెంకటయ్య, పశువైద్యులు హరీష్‌కుమార్ తదితరులు రమణయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

నేడు వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం

తిరుపతి సిటీ: ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల 63వ వార్షికోత్సవం శుక్రవారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించనున్నట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ధర ఉన్నా.. దిగుబడి లేదు


పుత్తూరు మార్కెట్ యార్డ్‌కు చేరిన తోతాపురి


పుత్తూరు మార్కెట్ యార్డులో లారీలకు లోడ్ అవుతున్న మామిడి

- మామిడి రైతులకు తప్పని నష్టాలు
- ఈసారి దిగుబడి మరింత దారుణం
- జూన్‌లోనే ముగుస్తున్న మామిడి సీజన్
- సిండికేట్‌గా మారిన వ్యాపారులు

- ఫ్యాక్టరీలో తోతాపురి టన్ను రూ.26 వేలు
- మండీల్లో తోతాపురి టన్ను రూ.33 వేలు
- బేనీషా రూ.45 వేలు, ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ రూ.55 వేలు
- చందూర రూ.30 వేలు
- పుత్తూరు మార్కెట్ యార్డుకు చేరుతున్న మామిడి


చందూర రకం మామిడి

ఏటా మామిడి రైతు నష్టాలనే చవి చూస్తున్నాడు. ఓ ఏడు దిగుబడి బాగుంటే, గిట్టుబాటు ధరలేక నష్టపోవడం. ఈ ఏడు ధర ఆశాజనకంగా ఉంటే, దిగుబడి లేకపోవడం వంటి పరిస్థితులను మామిడి రైతులు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది పుత్తూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో 20 శాతం దిగుబడి మాత్రమే రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

పుత్తూరు: సకాలంలో పూత రాకపోవడం, ఆలస్యంగా వచ్చిన పూత రాలిపోవడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడానికి కారణంగా రైతులు చెబుతున్నారు. పగలు అధిక ఉష్ణోగ్రతలు, రాత్రి మంచు కురవడం వంటి వాతావరణంలో ఊహించని మార్పుల వల్ల పంట దెబ్బతినిందని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈసారి తోటల సస్యరక్షణ పేరిట పెట్టిన ఖర్చులు సైతం చేతికి అందే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. పుత్తూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో 15 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. డివిజన్ పరిధిలో పుత్తూరు, వడమాలపేట, రామచంద్రాపురం, నారాయణవనం మండలాలు ఉండగా అధిక శాతం తోటలు వడమాలపేటలో ఉన్నాయి. ఈ ఒక్క మండలంలోనే ఐదు వేల ఎకరాలు ఉండగా, ఇందులో తోతాపురి రకం అగ్రభాగాన ఉన్నాయి. సాధారణంగా మంచి దిగుబడి వస్తే డివిజన్ మొత్తం మీద 45 నుంచి 50 వేల టన్నుల దిగుబడి వస్తుంది. అయితే ఈఏడు పూత సకాలంలో రాకపోవడంతో పాటు ఆలస్యంగా వచ్చిన పూత సైతం రాలిపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. ఎకరాకు కనీసం మూడు టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా నేడు అరటన్ను కూడా చేతి కందేటట్లు లేదు. దీంతో డివిజన్ మొత్తం మీద దిగుబడి 10 వేల టన్నులకు లోపే పడిపోయినట్లు అంచనా. టేబుల్ వెరైటీగా పిలవబడే బేనీషా దిగుబడే లేక అన్నదాతలు అల్లాడిపోయారు. ఒకటీ, అరా మామిడి చెట్లలో కనబడే కాయలను బంధు, మిత్ర వర్గాలకు పంచేందుకే సరిపోయిందని రైతులు వాపోతున్నారు. అదీగాక జూన్ నెల ప్రారంభం నుంచి మొదలైన నైరుతి రుతుపవనాల కారణంగా ఈదురుగాలులతో కూడిన వర్షం అడప దడపా పడుతుండడంతో ఉన్న కాయలు కూడా నేలరాలుతున్నాయి. దీంతో అన్నదాతల కంట కన్నీరు సుడులు తిరుగుతున్నాయి. జూలై 15 వరకు మామిడి సీజన్ కొనసాగాల్సి ఉండగా ఈసారి దిగుబడి తగ్గిన నేపథ్యంలో మరో పది రోజుల్లో మామిడి సీజన్ పూర్తి అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వ్యాపారుల సిండికేట్



మామిడి దిగుబడి తగ్గిన నేపథ్యంలో మార్కెట్ యార్డుల్లోని వ్యాపారులతో పాటు జ్యూస్ కంపెనీల వారు సైతం సిండికేట్ అయ్యారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా మోసం చేస్తున్నారు. వాతావరణం సహకరించక, వ్యాపారులు సహకరించకా రైతులు ఎలా బతకాలి. వ్యవసాయం జూదంలా తయారైంది. ప్రభుత్వాలు రైతుకు అండగా నిలబడకపోతే తినడానికి భవిషత్‌లో ఏమీ ఉండదు.

–టి.కేశవులు, అధ్యక్షుడు, కేవీబీఆర్‌పురం మామిడి రైతు సొసైటీ, పుత్తూరు

ప్రభుత్వమే ఆదుకోవాలి



నాకు ఐదు ఎకరాల మామిడి తోట ఉంది. ఎకరాకి రూ.25 వేలు వంతున రూ.1.25 లక్షలు ఖర్చు పెట్టాను. అయితే దిగుబడి ఏమాత్రం ఆశించన స్థాయిలో రాలేదు. ఇలా ఏటా నష్టపోతున్న మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. రైతుకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపాలి. వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. రాయితీతో మందులు పంపిణీ చేయాలి. తోటల్లోకి శాస్త్రవేత్తలను పంపి తగిన సూచనలు ఇప్పించాలి.

– దొరైనాయుడు, రైతు, శివగిరి, పిచ్చాటూరు మండలం

పెట్టుబడి సైతం వచ్చేటట్లు లేదు



ఈ ఏడు మామిడి దిగుబడి కేవలం 10 నుంచి 20 శాతానికి మించి లేదు. తోటల సస్యరక్షణకై పెట్టిన పెట్టుబడి సైతం చేతికందే పరిస్థితి కనబడడం లేదు. వాతావరణ మార్పుల కారణంగా ఈసారి నష్టపోయాం. ఏటా మామిడి రైతు ఏదోరకంగా నష్టపోతూనే ఉన్నాడు. దీనికి తోడు మార్కెట్ యార్డుల్లో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా మోసం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా మా తలరాతలు మాత్రం మారడం లేదు.

– ఎస్.చెంగయ్య, రైతు, కేవీబీఆర్ పురం, పుత్తూరు మండలం

ఎస్‌బీఐ ఏటీఎం మూత


మూతపడిన ఎస్‌బీఐ ఏటీఎం

నాగలాపురం: స్టేట్ బ్యాంకు ఏటీఎం కొన్ని రోజులుగా మూత పడి ఉండడంతో మండలంలోని ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని బజారు వీధిలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద ఏటీఎం కేంద్రం ఉంది. ఈ కేంద్రంలో ఏటీఎం మిషన్ కొన్ని రోజులుగా పనిచేయడం లేదు. దీంతో బ్యాంకు సిబ్బంది ఈ కేంద్రాన్ని మూసి వేశారు. దీంతో ఖాతాదారులు డబ్బులు కోసం నానా అవస్థలు పడుతున్నారు. ఏటీఎం వాడుకుంటున్నారని ఎస్‌బీఐ బ్యాంకు వారు సంవత్సరానికి రూ.150 ఛార్జీలు వసూలు చేస్తూ, అప్పుడప్పుడు ఇలా మూసివేయడం దారుణమని ఖాతాదారులు వాపోతున్నారు. మండలంలో ఎస్‌బీఐ ఖాతాదారులు అధిక సంఖ్యలో ఉన్నారు. ఏటీఎం పనిచేయకపోవడంతో నగదు కోసం ఖాతాదారులు బ్యాంకులో గంటల తరబడి బారులు తీరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఏటీఎం మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు కోరుతున్నారు.

చంద్రబాబుకు ముక్కంటి ప్రసాదాలు


చంద్రబాబును సన్మానిస్తున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును గురువారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా ఎన్నికైన బొజ్జల సుధీర్‌రెడ్డి విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబును కలంకారీ కండువాతో సన్మానించి శ్రీకాళహస్తీశ్వరస్వామి ప్రసాదాలను అందజేశారు.

పౌష్టికాహారం పంపిణీ పై ఆరా


అడవికండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి

పిచ్చాటూరు: ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా? లేదా.. అని ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి తనిఖీలు చేపట్టారు. గురువారం ఆమె మండలంలోని అడవికండ్రిగ, జీఎస్ పురం, ఎస్ఎస్‌బీ పేట, వేలూరు, గోవర్ధనగిరి, కుప్పంకండ్రిగ, నారాయణరాజు కండ్రిగలో సుడిగాలి పర్యటన చేసి, అంగన్‌వాడీల్లో ఆమె తనిఖీ చేశారు. చిన్నారులను, స్థానిక మహిళలను పౌష్టికాహారం సక్రమంగా అందిస్తున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పెరటి తోటల పెంపకంపై దృష్టి సారించి, వాటి ద్వారా పండించిన కూరగాయలను పిల్లలకు భోజనంగా అందించాలని ఆమె సూచించారు. ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త అంకిత భావంతో పని చేసి తమ పరిధిలోని పిల్లలకు మమతలు పంచే తల్లులుగా ఉండాలన్నారు. రాష్ట్రంలోనే తిరుపతి జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా పనిచేయాలని అంగన్‌వాడీలకు దిశానిర్దేశం చేశారు. అంగన్‌వాడీల్లోని రికార్డులను పరిశీలించి సరుకులు నిల్వలను సరిచూశారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టిక ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ శోభారాణి, సూపర్‌వైజర్ మారెమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్‌లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తప్పుడు వార్తలు రాస్తే చర్యలు


మాట్లాడుతున్న సీఐ మల్లికార్జున

రేణిగుంట: పోలీసుశాఖకు సంబంధించిన అంశాలు, గ్రామాల్లో జరిగే ఘటనలపై తప్పుడు వార్తలు రాసిన వారిపై చర్యలు తీసుకుంటామని రేణిగుంట అర్బన్ సీఐ మల్లికార్జున హెచ్చరించారు. అర్బన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో జరిగే ఘటనలు, ఏవైనా పోలీసు శాఖకు సంబంధించిన ఫిర్యాదులపై వాస్తవాలను తెలుసుకోకుండా కొందరు సత్యదూరమైన అంశాలను వార్తల రూపంలో రాస్తున్నారని, అలాగే వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేస్తున్నారని అన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే ఎస్‌హెచ్‌ఓతో ఒక్కసారి మాట్లాడి పునఃసమీక్షించుకోవాలని ఆయన కోరారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు


జింకకు వైద్యం చేస్తున్న గోపాలమిత్ర ప్రతాప్

తొట్టంబేడు : కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి ప్రాణరక్షణ కోసం ఓ జింక తెలుగు గంగ కాలువలోకి దూకిన ఘటన మండలంలోని పిల్లమేడు సమీపంలో గురువారం జరిగింది. తెలుగుగంగ కాలువలో ఓ జింక ఉన్నట్లు స్థానికులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. డీఆర్‌ఓ రామకృష్ణ, గార్డ్ దామోదరం, డ్రైవర్ కార్తీక్, చెక్‌పోస్టు సిబ్బంది వెంకటేష్ పిల్లమేడు చేరుకుని తెలుగుగంగ కాలువ నుంచి జింకను వెలికితీసి చూడగా ఆ జింక కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడినట్లు గుర్తించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న గోపాలమిత్ర ప్రతాప్‌ను సంప్రదించి జింకకు వైద్యం చేయించారు. జింక పరిస్థితి కాస్త ఆందోళనకరంగా ఉన్నట్లు డీఆర్‌ఓ రామకృష్ణ తెలిపారు. జింకను వైద్యుల పర్యవేక్షణలో మరికొన్ని రోజులు వైద్యం అందించి, ఆరోగ్యం కుదుటపడితే అడవిలో వదిలి పెడతామని డీఆర్‌ఓ చెప్పారు.

నీట్ ర్యాంకర్‌కు సత్కారం


విద్యార్థిని తరుణిమకు కేక్ కట్ చేసి అభినందనలు తెలుపుతున్న స్థానికులు

వరదయ్యపాళెం: నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన మండలంలోని సిద్దేశ్వరపురం గ్రామానికి చెందిన మనోహర్, ప్రసన్నలక్ష్మీ దంపతుల కుమార్తె ఎలుగొండ్ల తరుణిమను గ్రామస్తులు సత్కరించారు. తరుణిమ ఇటీవల జరిగిన జాతీయస్థాయి నీట్ పరీక్షల్లో 556 మార్కులు సాధించి, జాతీయస్థాయిలో 1295వ ర్యాంకును సొంతం చేసుకుంది. గ్రామీణ స్థాయిలో వైద్య విభాగంలో ఉచిత మెడిసన్ సీటును సాధించడంతో స్థానిక గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తరుణిమను సత్కరించి, కేక్ కట్ చేసి, ఆమెకు తినిపించి అభినందనలు తెలిపారు. వైద్య విద్యా రంగంలో ఉచిత సీటు సాధించడం హర్షణీయమని స్థానిక గ్రామస్తులు నక్కా గిరి, పూడి శ్రీనివాస్, శోభన్ యాదవ్, మోహన్, సుమన్‌లు తెలిపారు.

గ్రామాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు


వైద్యసేవలు అందిస్తున్న పింక్ బస్ సిబ్బంది


రోగుల వివరాలు నమోదు చేస్తున్న వైద్యసిబ్బంది

ఏర్పేడు: మండలంలోని కోబాక, పాతవీరాపురం గ్రామాల్లో గురువారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరిగాయి. కోబాక, పాత వీరాపురం, ఎస్సీ, ఎస్టీ కాలనీల నుంచి వచ్చిన రోగులకు మెమోగ్రామ్, అల్ట్రా స్కానింగ్ పేపస్మియర్, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు మానస, పద్మావతి, సురేష్‌కుమార్, సీహెచ్‌ఓ కృష్ణవేణి, ఏఎన్ఎం కామాక్షి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనానికి ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

తొట్టంబేడు : జాతీయ ఉపకార వేతనం అందుకునేందుకు శ్రీకాళహస్తి మండలం ఊరందూరు ఉన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు నిర్వహించిన పరీక్షకు పాఠశాల నుంచి హాజరైన రుత్విక్, శ్రీకర్, వర్షిత, నిహారిక ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం రాజకుమారి తెలిపారు. ఈ విద్యార్థులు ఏటా రూ.15 వేలు చొప్పున జాతీయ ఉపకార వేతనాన్ని నాలుగేళ్లపాటు అందుకోనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈసందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంగళంలో టీడీపీ నాయకుల దౌర్జన్యం


పనపాకం పంచాయతీ కార్యాలయ సమీపంలోని వైఎస్సార్ సీపీ జెండా దిమ్మె, బెంచీ ధ్వంసం చేసిన దృశ్యం


బెంచీలు, ఆటో ధ్వంసం




వాటర్ ప్లాంట్‌లో టీడీపీ నాయకులు విరగ్గొట్టిన కుర్చీలు, ధ్వంసమైన సీలింగ్ ఫ్యాన్

- వైఎస్సార్ సీపీ నాయకుడికి చెందిన వాటర్ ప్లాంట్ ధ్వంసం

తిరుపతి మంగళం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడడం, టీడీపీకి భారీ విజయం చేకూరడంతో టీడీపీ నాయకుల దాడులు మొదలయ్యాయి. మంగళంలోని పంచాయతీ డివిజన్ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు చిలమంద హరికృష్ణ నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్పై దాడికి స్థానిక టీడీపీ నాయకులు దాడి చేశారు. వాటర్ ప్లాంట్‌లోని కుర్చీలు, ఫ్యాన్లు, టేబుల్ ధ్వంసం చేశారు. అనంతరం వాటర్ ప్లాంట్‌కు తాళాలు వేసుకుని వెళ్లారు. ఫలితాలు విలువడిన 48 గంటల్లోనే టీడీపీ నాయకులు చేస్తున్న అరాచకాలను చూసి స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

పనపాకంలో ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం

చంద్రగిరి: పనపాకం పంచాయతీ కార్యాలయం వద్ద టీడీపీ కార్యకర్తలు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పంచాయతీ కార్యాలయం సమీపంలోని వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెతోపాటు బెంచీలు, చెత్త సేకరణ ఆటోను ధ్వంసం చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడంతో పాటు దౌర్జన్యాలకు పాల్పడడంపై ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ కార్యకర్తలు చేస్తున్న దౌర్జన్యాలపై ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే పరమావధి

- చంద్రగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా పర్యటించిన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

చంద్రగిరి: శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా, వాటి పరిరక్షణే పరమావధిగా జిల్లా పోలీసు యంత్రాంగం పని చేస్తోందని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. గురువారం ఆయన చంద్రగిరి సబ్ డివిజన్, చంద్రగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో సమస్యాత్మక గ్రామాలైన కొటాల, కూచువారిపల్లి, రంగంపేట, శేషాపురం, కందుల వారి పల్లి, చిన్న రామాపురం, భీమవరం గ్రామాలను సందర్శించారు. ఈ గ్రామాల్లో ఉన్న పోలీస్ పికెట్లను తనిఖీ చేస్తూ విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బందితో జిల్లా ఎస్పీ ముచ్చటిస్తూ ఏమైనా అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే పై అధికారులకు సమాచారం అందజేయాలని సూచనలిస్తూ, అప్రమత్తం చేశారు. అదనపు ఎస్పీ కులశేఖర్, ఏఆర్ డీఎస్పీ రవీంద్ర రెడ్డి, చంద్రగిరి సీఐ రామయ్య, ఎస్ఐ అనిత, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేకాలు, అలంకరణలు చేపట్టారు. అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు. పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో గురుదక్షిణామూర్తి